క్లుప్తంగా

'మదర్స్‌ల్యాండ్' విద్యార్థికి బంగారు పతకం



నర్సంపేట : ఈనెల 9న ముంబైలో జరిగిన ఇంటర్నేషనల్ రెండో ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్–2023 పోటీలో జూనియర్స్ కేటగిరీ, 11 ఏళ్ల విభాగంలో పట్టణంలోని మదర్స్‌ల్యాండ్ హైస్కూల్ విద్యార్థి నాడెం తేజ ప్రతిభ చాటి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా తేజను స్కూల్ చైర్మన్ పాశికంటి రమేశ్, ప్రిన్సిపాల్ నవిత సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తేజను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రమౌళి, మిట్యా, శివకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ముస్లింల తీర్మానం



పర్వతగిరి : వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌కు మద్దతు తెలుపుతూ మండల కేంద్రంలోని ముస్లింలు మంగళవారం తీర్మానం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అరూరి రమేశ్ గెలుపులో భాగస్వాములమౌతామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి తీర్మాణ పత్రాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్ మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు, తనకు మద్దతు తెలిపిన ముస్లింలలకు అండగా ఉంటానని చెప్పారు. తనకు మద్దతు తెలుపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల తనిఖీ



నెక్కొండ : ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో మండలంలోని చింతనెక్కొండ, చంద్రుగొండ క్రాస్ రోడ్లలో ఎస్సై జానీ పాషా ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. బ్యాంకు నుంచి డబ్బులు అధిక మొత్తంలో తీసుకెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు, రసీదులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో ప్రజలు నిబంధనలు పాటించాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు

వర్ధన్నపేట : బస్సును అతివేగంగా నడిపి మహిళ మృతికి కారకుడైన ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 8న వర్ధన్నపేట నుంచి డీసీ తండా వైపు నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని మహిళను వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్సైజ్ స్టేషన్ ఎదుట వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ తీవ్ర గాయాలపాలు కావడంతో స్థానికులు సమాచారం అందించడంతో ఆమెను 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎంకు పోలీసులు తరలించారు. కాగా మార్గమధ్యలోనే ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ క్రమంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కాసర్ల అయిలయ్య ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మృతురాలు ఆకుపచ్చ చీర, గులాబీ రంగు జాకెట్ ధరించి ఉందని, వయస్సు సుమారు 50 ఏళ్లు ఉండొచ్చని ఎస్సై తెలిపారు.

న్యాయం కోరుతూ భూబాధితుల ధర్నా



పర్వతగిరి : తమ భూమిని సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడి ఆక్రమణలోంచి కాపాడి తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రంపె యాకనర్సయ్య, కొమ్మాలు, సోములు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. తమ మూడెకరాల భూమిలో పెద్దతండా సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ అన్నారం గ్రామ నాయకుడు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని వాపోయారు. తమ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు.

అసమర్థ బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పక్కన రాంగోపాల్‌రెడ్డి

నర్సంపేట : అసమర్థ బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో శక్తి కేంద్రాల బాధ్యులు, ముఖ్యనాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆ పార్టీ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కాగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో నిశ్శబ్ద విప్లవం మొదలైందని చెప్పారు. బీఆర్‌ఎస్ అక్రమాలు, అవినీతి బాగోతాలను గమనిస్తున్న ప్రజలు క్రమశిక్షణ కలిగిన బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీనే విజయం వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత దొంతి మాధవరెడ్డి బీఆర్‌ఎస్‌కు షాడోగా పని చేస్తున్నాడని ఆరోపించారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన సీఎం కేసీఆర్‌కు మళ్లీ అవకాశం ఇస్తే అధోగతి పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే రాష్ట్రం ఆర్థిక నష్టాల నుంచి బయటపడుతుందని చెప్పారు. బీజేపీ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన అభివృద్ధే కనిపిస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రకాశ్‌రెడ్డి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. శ్రేణులు శక్తి వంచన లేకుండా పని చేసి ప్రకాశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కేంద్ర' నిధులతో సంక్షేమ పథకాలు

● బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి, నాయకులు

గీసుకొండ : కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పలు పేర్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్‌తో కలిసి 'ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమంలో విజయ్‌చందర్‌రెడ్డి ప్రజలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌కు ప్రధానిని విమర్శించే స్థాయి లేదని చెప్పారు. గృహలక్ష్మి పథకంలో కేంద్ర ప్రభుత్వ నిధులున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాన్ విక్రం, అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు, నాయకులు కొంగర రవికుమార్, ఆరకట్ల ప్రవీణ్, మొలుగూరి శ్రీనివాస్, గోదాసి అశ్విని, బిల్ల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలను ఉల్లంఘించొద్దు



రాయపర్తి : ఎన్నికల నియమాలను ఉల్లంఘించొద్దని ఎస్సై దేశిని విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని పెర్కవేడు, తదితర గ్రామాల్లోని బెల్ట్ షాపుల నిర్వాహకులకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో అందరూ సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చెప్పారు. ఎన్నికల నియమావళి గురించి అవగాహన కల్పించారు. బెల్ట్ షాపుల నిర్వాహకులను తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవితంలో మానసిక ఆరోగ్యమే కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

నర్సంపేట : మానవ జీవితంలో మానసిక ఆరోగ్యమే కీలకమని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని ఆ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు మానసికంగా బలవంతులయ్యే దిశగా ఆలోచించాలని సూచించారు. మానసిక స్థితిగతులపైనే జీవితం ఆధారపడి ఉంటుందని తెలిపారు. సమాజం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో వివిధ రకాల సమస్యలతో ఆందోళనకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. సానుకూల దృక్పథంతో జీవితంలో విజయాలను సొంతం చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్‌లను పరిమితంగా వాడుకోవాలని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం విద్యార్థులు పుస్తకాలు చదవాలని, యోగా చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆలేటి వెంకటేశ్వర్లు, వి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



చెన్నారావుపేట : అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ భారతి కోరారు. మండలంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల జెండాలను సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన క్రమంలో రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తోడ్పాటు అందించాలని చెప్పారు.

విద్యార్థుల ఉన్నతిలో టీచర్లు కీలకం

● డీటీడీఓ సౌజన్య



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న డీటీడీఓ

ఖానాపురం : విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకమని డీటీడీఓ సౌజన్య స్పష్టం చేశారు. మండలంలోని బొడిగెతండ, బండమీదిమామిడితండ, కోమటిపల్లితండ, రాంనాయక్‌తండాలోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. కోమటిపల్లితండ పాఠశాల హెచ్‌ఎం ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సక్రమంగా హాజరుకావాలని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌సీఆర్పీ గంగయ్య, ఉపాధ్యాయులు హరియ, రమ, స్వరూప, కిషన్, ఈర్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన యువకుడికి సన్మానం



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన తాటికాయల రంజిత్ కానిస్టేబుల్‌గా ఎంపికైన క్రమంలో ఆయన్ను నివాసంలో సర్పంచ్ ముత్యం దేవేంద్ర సంపత్, ఎంపీటీసీ దుగ్యాల జ్యోతి మాధవరావు, పీఏసీఎస్ డైరెక్టర్ తాటికాయల ఎల్లయ్య శాలువా, పూలమాలలతో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్ మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుడిగా తండ్రి సాంబయ్య, వ్యవసాయ కూలీగా తల్లి పని చేస్తూ రంజిత్‌ను కానిస్టేబుల్‌గా ఎంపికయ్యేలా ప్రోత్సహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కడు పేదరికంలో శిక్షణ తీసుకోకుండా కష్టపడి ఎంపికవడం పట్ల రంజిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీసీ కొమురయ్య, లక్ష్మయ్య, దయాకర్ పాల్గొన్నారు.

15 నుంచి రజతోత్సవ మహాసభలు



నెక్కొండ: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



దుగ్గొండిలో..

నెక్కొండ : ఈనెల 15 నుంచి 17 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 5వ రాష్ట్ర వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలు నిర్వహించనున్నట్టు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర కౌన్సిలర్ బానోతు జాన్‌నాయక్ తెలిపారు. ఆ మహాసభల వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో మంగళవారం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఐఆర్ 15 శాతానికి పెంచాలని, ఉద్యోగోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు భూక్యా బాలాజీ, నాయకులు ఇమ్మానుయేల్, శ్యాంసుందర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి హైస్కూల్‌లో మహాసభల వాల్‌పోస్టర్లను డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య, కొమ్మాలు, మండల బాధ్యుడు రావుల దేవేందర్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కొండూరులో దివ్యాంగుడు తోకల సంతోశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, సర్పంచ్ కర్ర సరిత రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కొమ్ము రాజు, నేరెల్లి మహేశ్ పాల్గొన్నారు.

ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

● కాలనీవాసుల్లో భయాందోళన.. అధికారుల్లో నిర్లక్ష్యం..



ఇళ్ల సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

నెక్కొండ : గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తీవ్రమవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. మండల కేంద్రంలోని అంగడి కాలనీలో 11 కేవీ విద్యుత్ వైర్లు ఇళ్లపై నుంచి వెళ్తున్నాయి. పలు చోట్ల స్తంబాలకు క్యాసరాలు లేకుండానే వైర్లు బిగించిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో గాలి వీచినప్పుడు వైర్లు ఒకదానికి మరొకటి తగిలి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి విద్యుత్ సరఫరా కావడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా సమస్యతో ఇబ్బంది పడుతున్నా, పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం ఉండడం లేదని స్థానికులు తెలిపారు. ప్రమాదం పొంచి ఉండడంతో కాలనీలో కొత్తగా ఇండ్లు నిర్మించుకునేందుకు జనం జంకుతున్నారు. ఇటీవల రాత్రి డాబాపైకి వెళ్తున్న క్రమంలో కాలనీవాసి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాణనష్టం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. వివరణ కోరేందుకు యత్నించగా అధికారులు స్పందించ లేదు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి



వర్ధన్నపేట : తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని ప్రక్షాళన చేయాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిశాల రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఇల్లందలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ, టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యంతో విద్యార్థులు, యువత నిరాశలో కూరుకుపోయారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేలా టీజేఎస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14న నిరసన కార్యక్రమం చేపడతామని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను తొలగించడంతోపాటు గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలు రాసి వేదనకు గురైన బాధితులకు రూ.3 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పర్వతగిరి : మాట్లాడుతున్న అనిల్‌రావు



నర్సంపేట : ప్రచారం చేస్తున్న నాయకులు



చెన్నారావుపేటలో..

నర్సంపేట : కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమౌతుందని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. పట్టణంలోని 2వ వార్డు పరిధిలోని కమలాపురంలో 'గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే ఆరు గ్యారంటీ స్కీములను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. ప్రజలను మోసం చేసి రెండు సార్లు సీఎం అయిన కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని తేటతెల్లం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన అందిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు మాట్లాడారు. పార్టీని గెలిపించేందుకు గ్రామ కమిటీల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకుడు కూసం రామచందర్, సొసైటీ డైరెక్టర్ జూలపల్లి గంగాధర్‌రావు, ఎం.సిమాజి, డైరెక్టర్ సునీల్‌రావు, కటెం సుధాకర్, మేచినేని మాధవరావు, బూత్ కన్వీనర్ పోకల శంకర్, గుగులోతు భాస్కర్, వెంకటస్వామి, సీనియర్ నాయకులు మల్లేషం, నూనె శంకర్, వెంకన్న, పిట్టల సుశీల, కనకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని బాపునగర్‌లో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ భాస్కర్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ నాయకుల చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో మాధవరెడ్డి

నర్సంపేట : పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు అప్పాల శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పట్టణ యూత్ ఉపాధ్యక్షులు పున్నం రాజు, గుర్రం వెంకన్న ఆ పార్టీకి రాజీనామా చేసి స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మండల అధ్యక్షుడు బానోతు లక్ష్మణ్ నాయక్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, పట్టణ కమిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ' ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించండి

● ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి : తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. మండలంలోని గిర్నిబావిలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ తదనంతరం ప్రజలను విస్మరించి మోసపూరిత పాలన సాగించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని చెప్పారు. కార్యకర్తలు నిబద్ధతతో పని చేసి పార్టీని గెలిపించాలని సూచించారు. ఎన్నికల అనంతరం క్రియాశీలకంగా పని చేసిన శ్రేణులకు గుర్తింపు ఇచ్చి కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, కిరణ్‌రెడ్డి, నర్సింగరావు, పెండ్యాల రాజు, ఇంద్రదేవ్, ఎడెల్లి శ్రీనివాసరెడ్డి, ఇంగోళి రాజేశ్వర్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొండా మురళికే పరకాల టికెట్

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సౌజన్య



సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

గీసుకొండ : కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికే ఇచ్చే ఆలోచనలో అధిష్టానం ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ భీమగాని సౌజన్య తెలిపారు. కొండా మురళి వస్తున్నారని, బీఆర్‌ఎస్ నాయకులు ఇక కాచుకోవాలని ఆమె హెచ్చరించారు. మండలంలోని కోటగండి వద్ద ఎంపీటీసీ వాంకుడోతు గోపాల్, కాంగ్రెస్ నాయకులు నాగబోయిన సారంగంతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కార్యకర్తలు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు హామీలు గుప్పించి తదనంతరం విస్మరించడం బీఆర్‌ఎస్ పార్టీకి అలవాటని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో గెలిస్తే కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ఆయనకు ఓటమి తప్పదన్నారు. సమావేశంలో నాయకులు అమిరిశెట్టి రాజు, బాలస్వామి, మొర్తాల యుగేందర్, రమేశ్, అంజీర రాజు, రంపీస అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయిస్తున్న సీఐ, ఎస్సై

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు నుంచి నీలగిరిస్వామి తండా వరకు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశమున్న 10 ప్రాంతాలను మంగళవారం గుర్తించారు. ఆ ప్రదేశాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయించడంతోపాటు రోడ్డుకు ఇరువైపులా చెట్లకు, స్తంభాలకు రేడియం స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.